ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
శుక్రవారం 12 జనవరి 2024

అటవీ భూములు అన్యాక్రాంతం 8

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి 8







మిగిలింది 20 రోజులే

- ఫిబ్రవరి 2న ముగియనున్న పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం
- గ్రామ పంచాయతీల్లో 'ప్రత్యేక' పాలన
- లోక్ సభ ఎన్నికల తర్వాతనే పంచాయతీ పోరు
- జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు, 2240 వార్డులు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతో స్థానిక సంస్థల పదవులు, నామినేట్ పోస్టులపై ఉత్సాహం చూపుతున్న ఆశావహులకు గ్రామ పంచాయతీ ఎన్నికలు నిరాశ కలిగిస్తున్నాయి. శాసనసభ ఎన్నికలు ముగిసిన వెంటనే గ్రామ పోరు తెరపైకి వస్తుందని కాంగ్రెస్ నాయకులు సిద్ధమయ్యారు. అయితే లోక్‌సభ ఎన్నికల తర్వాతే పంచాయతీ పోరు ముందుకు రానుంది. గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఎన్నికల సంఘం సన్నాహాలు ప్రారంభించినా ఆ తరువాత నిలిపివేసింది.

మరో 20 రోజులు అంటే ఫిబ్రవరి 2తో గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసిపోనుంది. చివరి మాసంలోనే షెడ్యూల్ రావాల్సి ఉన్నా అలాంటి ప్రయత్నాలు రాకపోవడంతో ఆరు నెలల పాటు పంచాయతీ ఎన్నికలకు ఎదురు చూడాల్సిన పరిస్థితి. ఈ నెల 30, 31 తేదీల్లో ప్రత్యేక అధికారుల నియామకం ఉత్తర్వులు వెల్లడి కానున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో గతంలో మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించారు. మొదటి విడతలో రుద్రంగి, చందుర్తి, వేములవాడ, వేములవాడ రూరల్, బోయినపల్లి, రెండో విడత వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, మూడో విడత తంగళ్లపల్లి, ఇల్లంతకుంట, కోనరావుపేట మండలాల్లోని గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు.

2019 జనవరి 30తో ఎన్నికల ప్రక్రియ ముగిసి ఫిబ్రవరి 2న బాధ్యతలు చేపట్టారు. ఈసారి కూడా సకాలంలోనే ఎన్నికలు జరుగుతాయని భావించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కలెక్టర్‌లకు సూచనలు చేస్తూ లేఖలు కూడా పంపింది. ఉద్యోగుల వివరాలు కూడా సేకరించారు. టీ పోల్ సాఫ్ట్‌వేర్‌లో వివరాలు అప్‌లోడ్ చేశారు. 200 మంది ఓటర్లతో ఉండే బూత్‌లో ఒక ప్రీసైడింగ్ అధికారి, పోలింగ్ అధికారి, 201 నుంచి 400 మంది ఓటర్లు ఉన్న బూత్‌లో ఒక ప్రీసైడింగ్ అధికారి ఇద్దరు పోలింగ్ అధికారులు, 400 నుంచి 650 మంది ఉండే పోలింగ్ బూత్‌లో ఒక ప్రీసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారుల చొప్పున సిబ్బందిని నియమించడంతోపాటు అదనంగా 20 శాతం మందిని రిజర్వ్‌గా ఎంపిక చేశారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి నిర్ణయం రాకపోవడం, లోక్‌సభ ఎన్నికలపై అధికారులు దృష్టి సారించడంతో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియకు బ్రేక్ పడింది. రాజకీయ సమీకరణలు మారుతున్న నేపథ్యంతోపాటు గ్రామ పంచాయతీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగానే ఎన్నికలు వాయిదా వేసినట్లు తెలుస్తోంది.

మారనున్న రిజర్వేషన్లు...

కొత్త పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం రెండు పర్యాయాలు కొనసాగే విధంగా రిజర్వేషన్లు ఖరారు చేసినా ఈ సారి రిజర్వేషన్లు మారే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో జిల్లాలోని పంచాయతీల్లో మెజార్టీ స్థానం 50 శాతం రిజర్వ్‌లో మహిళలకే ఎక్కువ స్థానాలు లభించాయి. 2011 జనాభాను పరిగణలోకి తీసుకొని ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు నిర్ధారించారు. బీసీలకు 50 శాతం కోటా మించరాదన్న గత ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా బీసీలకు పాలక వర్గ పదవులను రిజర్వ్ చేశారు.

గత పంచాయతీ ఎన్నికల ముందు చేపట్టిన ఈ సవరణ ప్రకారం ఈ సారి నిర్వహించే పంచాయతీ ఎన్నికల్లోనూ రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉంది. లేని పక్షంలో బీసీ గణన చేపట్టిన తర్వాతే మళ్లీ రిజర్వేషన్లు ఖరారు చేయాలి. ఈ పరిస్థితుల్లో రిజర్వేషన్లు మారే అవకాశం ఉంది. మరోవైపు విలీన గ్రామాలను మళ్లీ పంచాయతీలుగా మార్చడం, బీసీ రిజర్వేషన్లు, ఇతర ప్రక్రియతో ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు కూడా మార్చాల్సి వస్తుంది.

ఎన్నికలు లేకుండానే కరిగిన కాలం

జిల్లాలో ఉప ఎన్నికలు లేకుండానే పంచాయతీ కాలం కరిగింది. ఆరు సర్పంచ్ స్థానాలు, 88 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన సాగింది. చివరకు కొన్ని గ్రామ పంచాయతీల్లో ఐదేళ్ల కాలం గడిచిపోగా మరికొన్ని రెండు సంవత్సరాలకు పైగా ఖాళీగానే ఉండిపోయాయి. 2019లో సర్పంచ్ ఎన్నికలను బహిష్కరించిన ఇల్లంతకుంట మండలం గొల్లపల్లి గ్రామ పంచాయతీ ప్రజలు పట్టువీడకపోవడంతో ఐదేళ్ల కాలం గడిచిపోయింది. వీటితోపాటు జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉండగా వివిధ కారణాలతో 45 గ్రామ పంచాయతీల పరిధిలో 94 స్థానిక సంస్థల ఖాళీల్లో 6 సర్పంచ్ స్థానాలు, 88 వార్డు సభ్యుల స్థానాలు ఉన్నాయి. ఇల్లంతకుంట మండలంలో గొల్లపల్లి, దాచారం, సోమారంపేట, తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి, వీర్నపల్లి మండలం బావుసింగ్‌నాయక్ తండా, ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లి సర్పంచ్ స్థానాలు ఖాళీలు ఉన్నాయి.

వీటితోపాటు ఉప సర్పంచ్ ఖాళీల్లో బోయినపల్లి మండలం దేశాయి పల్లి, ఇల్లంతకుంట మండలం గుండపల్లి, గంభీరావు పేట మండలం దేశాయిపేట, కొత్తపల్లి, కోనరావుపేట మండలంలో కనగర్తి, మర్తనపేట, వేములవాడ మండలంలో అరెపల్లి ఖాళీలు ఉన్నాయి. జిల్లాలో 50 గ్రామ పంచాయతీల పరిధిలో 88 వార్డు సభ్యుల ఖాళీలు ఏర్పడ్డాయి. వార్డు సభ్యుల ఖాళీలు పరిశీలిస్తే బోయినపల్లి మండలంలో దేశాయిపల్లిలో 7వ వార్డు, స్థబంపల్లిలో 5వ వార్డు, కొదురుపాకలో 4వ వార్డు, మల్కపూర్‌లో 6వ వార్డు, రామన్నపేటలో 8వ వార్డు, గుండన్నపల్లిలో 1వ వార్డు చందుర్తి మండలంలో చందుర్తి 12వ వార్డు, ఆశిరెడ్డిపల్లి 6వ వార్డు, కొత్తపేటలో 3వ వార్డు, బండపల్లిలో 5వ వార్డు, జోగాపూర్‌లో 5వ వార్డు, కట్టలింగంపేటలో 8వ వార్డు, మల్యాలలో 11వ వార్డు, ఇల్లంతకుంట మండలం గూడెపల్లిలో 1వ వార్డు, గంభీరావుపేట మండలం దేశాయిపేట 5వ వార్డు, పొన్నాపల్లిలో 4వ వార్డు, కోనరావుపేట మండలం బావుసాయి పేటలో 4వ వార్డు, ధర్మారంలో 1వ వార్డు, 7వ వార్డు, 9వ వార్డు, 10వ వార్డు, కనగర్తిలో 3వ వార్డు, 10వ వార్డు, మల్కపేటలో 1వ వార్డు, 8వ వార్డు, మంగళ్లపల్లెలో 1వ వార్డు, 3వ వార్డు, 5వ వార్డు, 7వ వార్డు, మరిమడ్లలో 2వ వార్డు, 5వ వార్డు, 7వ వార్డు, 9వ వార్డు, మర్తనపేటలో 5వ వార్డు, 4వ వార్డు, నిమ్మపల్లిలో 2వ వార్డు, నిజామాబాద్‌లో 8వ వార్డు, 11వ వార్డు, 12వ వార్డు, పల్లిమక్తలో 3వ వార్డు, 7వ వార్డు, 8వ వార్డు, సుద్దాలలో 2వ వార్డు, ముస్తాబాద్ మండలం అవునూర్‌లో 2వ వార్డు, గోపాల్‌పల్లి 5వ వార్డు, ముస్తాబాద్‌లో 12వ వార్డు, తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్‌లో 9 వవార్డు, బద్దెనపల్లిలో సర్పంచ్‌తోపాటు మొత్తం 10 వార్డులకు ఎన్నికలకు జరగనున్నాయి.

గండిలచ్చపేటలో 1వ వార్డు, జిల్లెల్లలో 12వ వార్డు, లక్ష్మీపూర్‌లో 4వ వార్డు, మల్లాపూర్‌లో 1వ వార్డు, నేరెళ్లలో 3వ వార్డు, 9వ వార్డు, రాళ్లపేటలో 8వ వార్డు, 4వ వార్డు, తంగళ్లపల్లిలో 9వ వార్డు, వేణుగోపాల్‌పూర్‌లో 4వ వార్డు, కస్బెకట్కూర్ 1వ వార్డు, నేరేళ్ల 2వ వార్డు వీర్నపల్లి మండలంలో గర్జనపల్లిలో 6వ వార్డు, శాంతినగర్‌లో 1వ వార్డు, వేములవాడ మండలంలో అరెపల్లిలో 5వ వార్డు, వేములవాడ రూరల్ మండలంలో మల్లారంలో 2వ వార్డు, 6వ వార్డు, మర్రిపల్లిలో 8వ వార్డు, తుర్కాశినగర్‌లో 1వ వార్డు, 4వ వార్డు, వట్టెంల 8వ వార్డు, ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలో 1వ వార్డు, నారాయణాపూర్‌లో 10వ వార్డులు ఖాళీ ఉన్నాయి. వీటితో పాటు ఉపసర్పంచ్ స్థానాలు కూడా ఖాళీ ఏర్పడ్డాయి. ఉపసర్పంచ్‌లలో బోయినపల్లి మండలం దేశాయిపల్లి, ఇల్లంతకుంట మండలం గుండెపల్లి, గంభీరావుపేట మండలం దేశాయిపేట, కొత్తపల్లి, కోనరావుపేట మండలం కనగర్తి, మర్తనపేట, వేములవాడ మండలం అరెపల్లి ఉప సర్పంచ్‌లు ఖాళీగా ఉన్నాయి. స్థానిక సంస్థల ఖాళీల భర్తీ కాకపోవడంతో అయా వార్డుల్లో ప్రజల నుంచి నిరసనలు వ్యక్తమయ్యాయి.

విలీన గ్రామాల్లో పోరుకు సిద్ధం

సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో విలీనం చేసిన గ్రామాలను తిరిగి పంచాయతీలుగా మార్చనున్నట్లుగా ఎన్నికల్లో హామీలు ఇచ్చారు. దీనికి అనుగుణంగానే సిరిసిల్ల మున్సిపాలిటీలో విలీనమైన రగుడు, చంద్రంపేట, ముష్టిపల్లి, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూర్, సర్దాపూర్‌ను తిరిగి గ్రామ పంచాయతీలు ప్రకటించేందుకు తీర్మానలు చేయడంతో సందడి ఏర్పడింది. మళ్లీ ఆశావహులు ఎన్నికలకు సిద్ధమవుతూ మద్దతును కూడగట్టుకునే ప్రయత్నాలు మొదలు పెట్టారు. విలీన గ్రామాల్లో నెలకొన్న అసంతృప్తి తొలగించే దిశగా కాంగ్రెస్‌తోపాటు, మళ్లీ గెలుపొందిన సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ విలీనం గ్రామాలు విడిపోవడానికి అభ్యంతరం లేదని ప్రకటించారు. దానికి అనుగుణంగా మున్సిపాలిటీల్లో తీర్మానాలు కూడా చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో గ్రామ పంచాయతీలుగా చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో విలీనగ్రామాల్లో ఎన్నికలపై ఆసక్తి ఏర్పడింది.

పకడ్బందీ చర్యలు చేపట్టాలి


రాజన్న ఆలయ అధికారులతో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జనవరి 11 : దక్షిణకాశీగా విరాజిల్లుతున్న రాజన్న ఆలయానికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తున్నారని, ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. రాజన్న ఆలయంలోని చైర్మన్ ఛాంబర్‌లో ఆలయ అధికారులతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో సమ్మక్క, సారలమ్మ జాతర ఉందని, మందస్తుగా భక్తులు రాజన్న దర్శనానికి పెద్ద సంఖ్యలో వస్తారని అన్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా ఆది, సోమ, శుక్రవారాల్లో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఏఈవో ప్రతాప నవీన్, శ్రీనివాస్, నటరాజు, సిరిగిరి శ్రీరాములు, అల్లి శంకర్, వరి నర్సయ్య, గోలి శ్రీనివాస్, అధికారులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఇల్లంతకుంట, జనవరి 11: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సెస్ ఏఈ రాకేష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలకేంద్రంలోని 132కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుతో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో మెగా హెల్త్ క్యాంపు

గంభీరావుపేట, జనవరి 11: గంభీరావుపేట సామాజిక ఆరోగ్య కేద్రంలో గురువారం మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. గర్భినులకు పరీక్షలు నిర్వహించారు. ఆహార అలవాట్లపై, వ్యాయామాలపై పూర్తి అవగాహన కల్పించారు. ప్రతీ గురువారం సామాజిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. డీసీఎస్‌హెచ్‌ఎస్ మురళిధర్‌రావు, సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ ఏవీ శ్రీనివాస్, వైద్యులు సుస్మిత, కిరణ్మయి, లింగన్నపేట వైద్యాధికారి వేణుగోపాల్, వైద్యులు సృజన్, సుష్మ ఉన్నారు.

పరీక్షలంటే భయపడ వద్దు

సిరిసిల్ల రూరల్, జనవరి 11: పరీక్షలంటే విద్యార్థులు భయపడవద్దని, ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాసి ఉత్తీర్ణతను సాధించాలని డీఈవో రమేష్‌కుమార్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం పరిశీలించారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులను కలిసి వివిధ సబ్జెక్టులకు సంబంధించి పలు పశ్నలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రధానోపాధ్యాయుడు లకావత్ మోతిలాల్ పాల్గొన్నారు.

సీఎం పీఆర్వోగా శ్రీనివాస్

సిరిసిల్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన జర్నలిస్ట్ బొల్గం శ్రీనివాస్‌ను సీఎం పీఆర్వోగా నియమిస్తూ గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాస్ వివిధ పత్రికల్లో పని చేశారు. సీఎం పీఆర్వోగా నియమాకంపై జిల్లా పాత్రికేయులు అభినందనలు తెలిపారు.

ఐసీఎస్ఎస్ఆర్ పోస్ట్ డాక్టోరల్ ఫెల్లోషిప్‌కు ఎంపిక

గంభీరావుపేట, జనవరి 11 : గంభీరావుపేట మండలం దమ్మన్నపేటకు చెందిన విస్లావత్ సురేందర్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్(ఐసీఎస్ఎస్ఆర్) పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌కి ఎంపికయ్యారు. సురేందర్ ఇంతకు ముందు పాండిచ్చేరి యూనివర్సిటీ నుంచి డాక్టరేట్‌ను పొందారు. ప్రస్తుతం రాజన్న జోన్‌లోని స్కూల్స్ స్టూడెంట్స్‌పై పరిశోధన చేస్తున్నారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన చైర్‌పర్సన్


శుభాకాంక్షలు తెలుపుతున్న చైర్‌పర్సన్

వేములవాడ టౌన్, జనవరి 11 : జిల్లాకు నూతనంగా వచ్చిన అడిషనల్ కలెక్టర్ పూజారి గౌతమిని వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి రాజు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నరాల శేఖర్, నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, గోలి మహేష్, శంకర్ ఉన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కోనరావుపేట, జనవరి 11 : కోనరావుపేట మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సాగర్ తెలిపారు. 7,8, 9, 10 తరగతుల్లో ఖాళీల భర్తీకి ఈ నెల 12 నుంచి ఫిబ్రవరి 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు ఫారమ్‌ను మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో అందజేయాలని సూచించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస వేడుకలు

చందుర్తి, జనవరి 11: చందుర్తి మండలం బండపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం వేడుకల్లో భాగంగా గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి శ్రీకాంతాచార్యులు మాట్లాడుతూ ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి అమ్మవారికి ప్రతీరోజు కుంకుమ పూజ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈనెల 13న శనివారం ఉదయం 10-35 నిమిషాలకు ఆలయంలో గోదా రంగనాథుల కల్యాణాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

కేంద్ర బృందం పర్యటనకు ఏర్పాట్లు చేయాలి


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 11 : జిల్లాలో 'వికసిత్ సంకల్ప యాత్ర'ను పరిశీలించేందుకు శుక్రవారం కేంద్ర బృందం పర్యటించనుందని, ఇందు కోసం ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో కేంద్ర బృందం పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు. కేంద్ర టెక్స్‌టైల్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి, వికసిత్ సంకల్ప యాత్ర జిల్లా నోడల్ అధికారి అజయ్‌గుప్తా ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్ర బృందం కోనరావుపేట మండలం మల్కపేట, బోయిన్‌పల్లి మండలం అనంతపల్లి గ్రామాల్లో వికసిత్ సంకల్ప యాత్రను పరిశీలించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ శాఖలు ఆక్టివిటీ, విజయగాథలను తెలిపే స్టాల్స్‌లను ఏర్పాటు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, డీఆర్‌డీవో నక్క శ్రీనివాస్, డీపీవో రవీందర్, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్‌మోహన్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్, జిల్లా ఉద్యాన అధికారి జ్యోతి, జిల్లా మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ జానకీ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయాలి


మాట్లాడుతున్న బాల సాహితీవేత్త డాక్టర్ శర్మ

ఎల్లారెడ్డిపేట, జనవరి 11: విద్యార్థుల్లో సాహితీ సృజనాత్మకతను వెలికి తీయాలని ప్రాణహిత ట్రస్ట్ బాధ్యులు కే రమణ, ప్రముఖ బాల సాహితీవేత్త డాక్టర్ వీఆర్ శర్మ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాణహిత ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమండ్లు అధ్యక్షతన విద్యార్థులకు సాహిత్య సృజన అంశంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల్లో దాగి ఉన్న తెలివికి పదును పెట్టాలంటే వారిని స్వేచ్ఛగా మాట్లాడనివ్వాలన్నారు. విద్యార్థులకు సబ్జెక్టులను నేర్చుకోవడంతోపాటు కథలు, రచనలు రాసే సత్తా ఉండాలన్నారు. మాతృభాషతోపాటు ఆంగ్లభాషలో ఆసక్తి పెంచుకొని మెళకువలు నేర్చుకోవాలన్నారు. సాహితీ వేత్తలు శ్యామ్‌రావు, శ్రీనివాస్, ట్రస్ట్ పక్షాన దేవిరెడ్డి, లక్ష్మణ్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

చైనా మాంజ ఉపయోగిస్తే చర్యలు

సిరిసిల్ల క్రైం, జనవరి 11: ప్రభుత్వ నిషేధిత చైనా మాంజ ఉపయోగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో మాట్లాడారు. గాలి పటాలు ఎగరడం కోసం వినియోగించే గాంజా పూత పూసిన నైలాన్, సింథటిక్ దారాలు పక్షులకు, పర్యావరణానికి, మనుషులకు హాని చేస్తాయన్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాలను అనుసరించి రాష్ట్రంలో చైనా మాంజ వినియోగాన్ని పూర్తిగా నిషేధించామన్నారు. ఎవరైనా మాంజా విక్రయిస్తే 100కు లేదా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


వివరాలు తెలుసుకుంటున్న ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జనవరి 11 : ప్రజా ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ ఏరియా ఆసుపత్రిని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అందించే ప్రతీ సంక్షేమ పథకం నిరుపేదలకు ఉపయోగపడాలని, వారి వరకు చేరాలనేదే ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఏరియా ఆసుపత్రిపై ఎంతో నమ్మకంతో వస్తున్న రోగులకు మెరుగైన వెద్యాన్ని అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రిపై నమ్మకం కలిగించాలని వైద్యులను కోరారు. ఆరోగ్యశ్రీ పథకం రూ.10 లక్షలకు పెంచడం గొప్ప విషయమని, అర్హులైన ప్రతీ ఒక్కరికి ఆరోగ్యశ్రీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రోగులకు వైద్యం అందించడంలో వైద్యులది ముఖ్యపాత్ర అనిఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం వేములవాడ పట్టణంలోని బాలానగర్‌లో నూతన రేషన్ షాపును ప్రారంభించారు. ఆసుపత్రి సూపరిండెంట్ రేగులపాటి మహేష్‌రావు నాయకులు సాగరం వెంకటస్వామి, సంద్రగిరి శ్రీనివాస్, కనికారపు రాకేష్, నాగుల విష్ణు, అక్కనపెల్లి నరేష్ తదితరులు ఉన్నారు.

యువత వివేకానంద స్ఫూర్తితో ముందుకు సాగాలి

యువత వివేకానంద స్ఫూర్తితో ముందుకు సాగాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలం అగ్రహారంలో ఏర్పాటు చేసిన జాతీయ యువజన దినోత్సవంలో మాట్లాడారు. విద్యార్థులకు వివేకానంద జయంతి శుభాకాంక్షలు తెలిపారు. వివేకానందుడు ప్రసంగాల ద్వారా యువతలో స్ఫూర్తిని నింపారన్నారు. సమావేశంలో నరేన్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

చందుర్తి, జనవరి 11: చందుర్తి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అధ్యక్షురాలు బైరగోని లావణ్య రమేష్ గురువారం తెలిపారు. మండల పరిషత్‌లోని సమావేశ మందిరంలో జరిగే సర్వసభ్య సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన


ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగిస్తున్న సిబ్బంది

ఎల్లారెడ్డిపేట, జనవరి 11: ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో అంధకారం అలుముకుంది. ఈ విషయమై 'అక్కపల్లిలో అంధకారం'అనే శీర్షిక ఈ నెల 11న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌ను ఏర్పాటు చేశారు.

పెండింగ్ ఈ- చాలన్ల మెగా డిస్కౌంట్ మేళాకు స్పందన

- 15 రోజుల్లో రూ. కోటి వసూలు - 1,56,091 చాలన్ల చెల్లింపు - మిగిలినవి 2,03,745- 31వరకు గడువు పొడిగింపు


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

సిరిసిల్ల క్రైం, జనవరి 11: జిల్లాలో వాహనాల ఈ-చాలన్‌ల జరిమానాల చెల్లింపునకు విశేష స్పందన లభిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 3,50,667 వాహనాలపై పెండింగ్ ఈ- చాలన్‌లు ఉండేవి. జిల్లాలో రాయితీ లేకుండా ట్రాఫిక్ ఈ-చాలన్‌ల ద్వారా బకాయిలు 10 కోట్ల 5లక్షల 50వేల 195 రూపాయలు చెల్లించాల్సి ఉండేది. మెగా డిస్కౌంట్ మేళా ద్వారా 15 రోజుల్లో 1,56,091 చాలన్‌లకు సంబంధించి రూ.కోటి వసూళ్లయ్యాయి. మిగతా 2,03,745 ఈ-చాలన్‌ల జరిమానా బకాయిలు చెల్లించాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ పెండింగ్ ఈ-చాలన్‌ల చెల్లింపునకు ఈనెల 31 వరకు గడువు పొడిగించింది.

వాహనదారులకు వెసులుబాటు

భారీ రాయితీ ద్వారా వాహనదారులు వినియోగించుకునే వెసులుబాటు కలిగింది. ఈ మేళాలో ద్విచక్రవాహనాలకు 80 శాతం, కార్లు, లారీలు, ఇతర భారీ వాహనాలకు 60 శాతం, ఆర్టీసీ వాహనాలకు 90 శాతం రాయితీ ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ-చాలన్‌ల చెల్లింపులకు భారీ రాయితీ ప్రకటించడమే కాకుండా గడువు పెంచడంతో వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే వీలు ఏర్పడింది. 15 రోజుల్లో 40 శాతం వాహనదారులు భారీ రాయితీ అవకాశాన్ని వినియోగించుకున్నారు. మిగతా పెండింగ్ ఈ-చాలన్‌ల జరిమానాల చెల్లింపునకు గడువు పెంచడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

- అఖిల్ మహాజన్, ఎస్పీ



ఈ-చాలన్‌ల చెల్లింపునకు స్పందన లభిస్తోంది. ఈ-చాలన్‌ల చెల్లింపు గడువును ప్రభుత్వం మరో 20 రోజులు పొడిగించింది. మెగా డిస్కౌంట్ మేళాను వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలి.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


కోల సంతోష్(ఫైల్)

జమ్మికుంట రూరల్, జనవరి 1: జమ్మికుంట మండలం మడిపల్లి రైల్వే గేట్ సమీపంలో గురువారం ఆర్థిక ఇబ్బందులు తాళలేక గుర్తు తెలియని రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. వీణవంక మండలం శ్రీరాములపేట గ్రామానికి చెందిన కోల సంతోష్ (28) కమలాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్ కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నా డు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై మడిపల్లి కెనాల్ సమీపంలో ద్విచక్ర వాహనం పార్క్ చేసి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య నాగమణి, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీస్‌లు తెలిపారు.

బీరు సీసాతో దాడి.. ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, జనవరి 11: శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన నిజానపు శివాజీపై బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి బీరు సీసాతో దాడి చేశారు. ఈ ఘటనలో శివాజీ తలకు, చెంపకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది ఈఎంటీ సతీష్‌రెడ్డి, పైలట్ ఖాజా ఖలీల్ లాల్‌లు సంఘటన స్థలానికి చేరుకొని హుజూరాబాద్ ఆస్పత్రికి తర లించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

శంకరపట్నం, జనవరి 11: శంకరపట్నం మండలం కొత్తగట్టుకు చెందిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల సమాచారం మేరకు.. శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన కామెడి సాంబశివరెడ్డి (48) ఈ నెల 10న ఇంటి నుంచి వ్యవసాయ బావి వద్దకు తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఆ సమయంలో హుజూరాబాద్ వైపు నుంచి ఎదు రుగా వస్తున్న సైదాపూర్ మండలం సోమారం గ్రామానికి చెందిన ములు గూరి జాన్ తన బైక్‌ను అజాగ్రత్తగా, అతివేగంగా నడుపుతూ కరీంనగర్-వ రంగల్ రహదారిపై కొత్తగట్టు శివారులో ఢీ కొట్టాడు. కింద పడిన ఈ సాంబశివారెడ్డికి తల భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొం దుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్లు ఎంపిక పోటీలు

రామడుగు, జనవరి 11: రామడుగు మండల కేంద్రంలో ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి జట్ల ఎంపిక పోటీలు గురువారం నిర్వహించారు. ఈ నెల 17న ఆసిఫాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఇక్కడ ప్రతిభ చాటిన విద్యార్థులను ఎంపిక చేశారు. పోటీలను స్థానిక సర్పంచ్ పంజాల ప్రమీల ప్రారంభించారు. కార్యక్రమంలో చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలలో చోరీ

జగిత్యాల టౌన్, జనవరి 11:జగిత్యాల జిల్లా కేంద్రంలోని పురాణిపేటలో చోరీ జరిగింది. గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి అర తులం బంగారంతో పాటు రూ. 5 వేల నగదును అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పురాణి పేటకు నోముల సాగర్ కుటుంబ నెల రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి అమెరికాకు వెళ్లి గురువారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చారు. ఇంటి తలుపులకు ఉన్న తాళం పగులగొట్టి ఉండడం చూసి దొంగతనం జరిగినట్లుగా గుర్తించారు. దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువా తాళాలు పగులగొట్టి విలువైన వస్తువులతో పాటు బంగారం, నగదు అపహరించుకవెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. వేలి ముద్రలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నటేష్ పేర్కొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో నలుగురు డీబార్

గణేశ్‌నగర్, జనవరి 11: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ ఒకటి, మూడో సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం నలుగు రు విద్యార్థులను డీబార్ చేసినట్టు శాతవాహన యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వి శ్రీరంగ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో సెమిస్టర్ పరీక్షలో కరీంనగర్‌లోని ట్రినిటి డిగ్రీ కళాశాలలో ఇద్దరు, వికాస్ డిగ్రీ కళాశాలలో ఒకరు, అల్ఫోర్స్ డిగ్రీ కళాశాల లో ఒకరు మొత్తం నలుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు తెలిపారు.

యువత దేశసేవలో పాల్గొనాలి

- ఎస్‌యూ ఉపకులపతి ఆచార్య సంకసాల మల్లేష్



శిక్షణా శిబిరానికి ఎంపికైన వలంటీర్లతో వీసీ ఆచార్య సంకసాల మల్లేష్

గణేశ్‌నగర్, జనవరి 11: జాతీయ సాహస శిక్షణ శిబిరాల్లో యువత పాల్గొని మానసిక, శారీరక దృఢ సంకల్పంతో దేశ సేవలో పాల్గొనాలని శాతావాహన యూనివర్సిటీ(ఎస్‌యూ) ఉపకులపతి ఆచార్య సంకసాల మల్లేష్ పిలుపునిచ్చారు. హిమాచల్‌ప్రదేశ్‌లో (నార్కంద) లోని అటల్ బిహారి వాజ్‌పేయి పర్వతారోహణ సంస్థలో శిక్షణ శిబిరానికి ఎంపికైన పదిమంది వలంటీర్లు తమ శిక్షణను పూర్తి చేసుకుని వచ్చిన సందర్భంగా వీసీ వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు ఇంకా ఇలాంటి శిక్షణ శిబిరాల్లో పాల్గొని మానసిక, శారీరక దృఢ సంకల్పంతో దేశ సేవలో పాత్రులుగా కావాలని పిలుపునిచ్చారు. జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ ఈ మనోహర్ మాట్లాడుతూ వలంటీర్లు పర్వతారోహణ, ఇతర సాహస కార్యక్రమాల్లో శిక్షణ తీసుకున్నారని వీరు శాతవాహన యూనివర్సిటీలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులని, మంచి భవిష్యత్ ఉందని తెలిపారు. కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వరప్రసాద్ శిక్షణ శిబిరం కంటిన్జెంట్ లీడర్ శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్లు విజయ ప్రకాష్, డాక్టర్ తిరుపతి, డి విజయ్ కుమార్, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎక్స్‌కావేటర్ స్వాధీనం

శంకరపట్నం, జనవరి 11: శంకరపట్నం మండలం మక్త గ్రామ గుట్ట నుంచి అక్రమంగా మట్టి తవ్వుతున్న ఎక్స్‌కావేటర్‌ను గురువారం స్వాధీనం చేసుకున్నామని తహసీల్దార్ అనుపమ చెప్పారు. వెంచర్లకు ఎలాంటి అనుమతి లేకుండా మక్త గుట్ట నుంచి మట్టి తరలిస్తున్న ఎక్స్‌కావేటర్‌ను పట్టుకొని కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలని తెలిపారు.

వృద్ధురాలిపై అత్యాచారం ఘటనలో ఒకరి అరెస్టు



మాట్లాడుతున్న సీఐ కిరణ్‌కుమార్

చందుర్తి, జనవరి 11: చందుర్తి మండలం లింగంపేట గ్రామ శివారులోని శ్మశాన వాటిక వద్ద వృద్ధురాలిపై అత్యాచారం ఘటనలో ఒకరిని అరెస్టు చేసినట్లు చందుర్తి సీఐ కిరణ్ కుమార్ తెలిపారు. గురువారం కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 9న కట్టలింగంపేట గ్రామానికి చెందిన ఆవునూరు తిరుపతి అనే వ్యక్తి ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని బలవంతంగా తన ఆటోలో ఎక్కించుకొని లింగంపేట శివారుకు తీసుకెళ్లి ఆటోలో అత్యాచారం చేశాడు. తిరిగి ఆటోలో లింగంపేట బస్టాండ్ వద్ద వదిలిపెట్టి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం నిందితుడు సనుగుల నుంచి వేములవాడ వెళుతున్నాడని సమాచారంతో మర్రిగడ్డ ఎక్స్ రోడ్ వద్ద పట్టుకున్నట్లు, ఆటో, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

9 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

కరీంనగర్ క్రైం, జనవరి 11 : కరీంనగర్‌లోని లక్ష్మీనగర్‌లో పేకాట ఆడుతున్న ఒక స్థావరంపై గురువారం కరీంనగర్ స్పెషల్‌బ్రాంచి సీఐ కే సృజన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి తొమ్మిది మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. వారి వద్దనుంచి 1.40 లక్షల రూపాయలు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని ఒకటో టౌన్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ధర్మారం,జనవరి11: మండలంలోని బొమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బొల్లి లచ్చయ్య(60) అనే వృద్ధుడు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడని ఎస్సై సత్యనారాయణ తెలిపారు. గత నెల 30న రాత్రి ఇంటి ముందు చలిమంట కాగుతుండగా మంటలంటుకున్నాయి. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. మృతుని కొడుకు బొల్లి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'అణగారిన వర్గాల అభ్యున్నతికి పోరాటం ఉధృతం'

గణేశ్‌నగర్, జనవరి 11 : జనాభా దామాషా ప్రకారం బీసీల వాటా కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాటాన్ని ఉధృతం చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ బీసీలకు గురువారం పిలుపునిచ్చారు. బీసీ మహనీయుల జన్మ స్థలాలను సందర్శించే కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ జిల్లా కేంద్రానికి విచ్చేసిన తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహానికి నివాళులర్పించారు. చట్ట సభల్లో బీసీ వాటా, బీసీ హక్కుల సాధన కోసం అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దుబ్బాక రమేష్, పెంట అజయ్ పటేల్, మునిగాంటి అశ్విన్, గిరిగాని భిక్షపతి, కార్యదర్శి తౌటం సత్యం, కాల్వ మధుబాబు, కాల్వ కిషన్, రాంపర్తి వికాస్, సాయికిరణ్, పాల్గొన్నారు.

పందెం కోడికి వేలం

భగత్‌నగర్, జనవరి 11: ఆర్టీసీ బస్సులో మరిచిపోయిన పందెం కోడికి నేడు కరీంనగర్-2 డిపోలో వేలం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తేదీన ఆర్టీసీ బస్సులో మరిచిపోయిన కోడికి సంబంధించి ఎవరూ రాలేదన్నారు. కరీంనగర్ అంబేద్కర్ బస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు ఆసక్తికల వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

కరీంనగర్ రూరల్, జనవరి 11: వ్యవసాయ కమిషనర్ ఆదేశాల మేరకు ఫెర్టిలైజర్ ఇన్వెంటోరీ వెరిఫికేషన్ సిస్టం ద్వారా కరీంనగర్ రూరల్ మండలంలోని గురువారం వ్యవసాయాధికారి బి సత్యం మూడు దుకాణాలను తనిఖీ చేశారు. తీగలగుట్టపల్లిలోని కేడీసీఎంఎస్, వల్లంపహాడ్‌లోని వాసవి ఫెర్టిలైజర్స్, నగునూరులోని అగ్రోస్ సెంటర్ దుకాణాలను తనిఖీ చేశారు. యూరియా, డీఏపీ, ఈపాస్ మిషన్‌తోపాటుగా నిల్వఉన్న ఎరువులు సరిపోయే వరకు ఆయా దుకాణాల పేర్లు ప్రతీ వారం తనిఖీ నిర్వహిస్తామని తెలిపారు.

చొప్పదండి: పట్టణంలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి గురువారం తనిఖీ చేశారు. ఎరువుల నిల్వల వివరాలను నమోదు చేసుకున్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొత్తకొండ జాతరకు ప్రతీ రోజు 80 ఆర్టీసీ బస్సులు

భీమదేవరపల్లి, జనవరి 11 : కొత్తకొండ జాతర బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కొత్తకొండ జాతరకు ప్రతిరోజు హుజూరాబాద్ నుంచి 80ట్రిప్పుల ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు. గురువారం కొత్తకొండ జాతరలో ఆర్టీసీ తాత్కాలిక బస్టాండ్‌ను పరిశీలించారు. బ్రహ్మోత్సవాలకు హుజూరాబాద్ డిపో నుంచి 20 బస్సులను రోజు 80ట్రిప్పులు నడపనున్నట్లు తెలిపారు. పెద్దలకు రూ. 60, చిన్నారులకు రూ. 30 టికెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులను హుజూరాబాద్ నుంచి వయా మాణిక్యాపూర్, ముల్కనూర్, కొత్తకొండకు ప్రయాణీకులను చేరవేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళా ప్రయాణీకులకు ఉచితంగా జాతరకు చేరవేస్తామన్నారు. అనంతరం కొత్తకొండ శ్రీవీరభద్రస్వామిని దర్శించుకున్నారు. కాగా కొత్తకొండ జాతరకు రావాలని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు దేవాలయ అర్చకులు, సిబ్బంది గురువారం ఆహ్వాన పత్రం అందజేశారు.

అక్షర సూర్యుడు 'అలిశెట్టి'

- జగిత్యాల జైత్రయాత్రలో కలం ఎర్ర సూరీడై..
- సాహితీ మిత్రదీప్తితో కవిత్వంపై అభిలాష
- నేడు అలిశెట్టి జయంతి, వర్ధంతి



అలిశెట్టి ప్రభాకర్

జగిత్యాల/సిరిసిల్ల/కరీంనగర్ కల్చరల్ జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పద సంపద పరిమితమైన అపరిమితమైన భావసంపద ఉన్న కవిత్వం అతని సొంతం..పొట్టి పొట్టి వ్యాక్యాల్లో పొడవైన వాదాన్ని పూరించి సూటిగా ప్రశ్నించడమే ఆ..కవితల గొప్పతనం. పొట్టి కవితల్లో తన వాదాన్ని గట్టిగా వినిపించిన కవి అలిశెట్టి ప్రభాకర్. నిర్భయంగా, నిజాయితీగా తన మదిలో మెదిలిన ఆలోచనలను కలంలో నింపి, అక్షరాలను ప్రకాశింప జేసిన కవనసూరీడు అతడు. అలిశెట్టి జన్మించింది, మరణించింది ఒకే తేదీన కావడం యాదృచ్ఛికమైనా మరణం నా చివరి చరణం కాదు అని ప్రకటించిన అక్షర వీరుడిగా సాహితీ అభిమానుల్లో చెదిరిపోని ముద్రను వేసుకున్నాడు. నేడు అలిశెట్టి జయంతి, వర్ధంతి సందర్భంగా అందిస్తోన్న ప్రత్యేక కథనం..

● అడుగడుగున అలిశెట్టికి కష్టాలే...

జగిత్యాలలో 1956 జనవరి 12న జగిత్యాలలోని అంగడిబజార్ ప్రాంతంలో జన్మించిన అలిశెట్టి ప్రభాకర్‌కు ఏడుగురు అక్కాచెల్లెల్లు, ఇద్దరు అన్న దమ్ములు కాగా ప్రభాకర్ ఐదోవాడు. అలిశెట్టికి భార్య భాగ్యలక్ష్మితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. బతుకు దెరువు కోసం తన అభిరుచులైన చిత్రలేఖనం, ఫొటోగ్రఫీని వినియోగించుకున్నాడు. సిరిసిల్లలో ఫొటోగ్రఫీ నేర్చుకుని, 1975లో జగిత్యాలలో పూర్ణిమ స్టూడియోను ప్రారంభించాడు. 1979లో కరీంనగర్‌లో స్టూడియో శిల్పి నడిపాడు. 1982లో హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. 1983లో స్టూడియో చిత్రలేఖ స్థాపించాడు. హైదరాబాద్ నగర జీవితాన్ని 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో సిటీ లైఫ్ సీరియల్‌గా రాశాడు.

● జగిత్యాల జైత్రయాత్రలో సాహితీ భాగస్వామ్యం..

సాహితీ మిత్ర దీప్తి సంస్థ పరిచయంతో కవిత్వంపై అలిశెట్టికి అభిలాష ఏర్పడింది. 1978లో జగిత్యాల జైత్రయాత్రతో తన కలం ఎర్ర సూరీడై ప్రజ్వలించింది. దోపిడి దారుల అకృత్యాలు, పెత్తందారుల అణిచివేత లతో సతమతమవుతున్న ప్రజల హృదయ ఘోషను తన కవితా వస్తువుగా మలుచుకున్నాడు. రగిలిన గుండె ఎర్రపావురమై ఎగిరి జైత్ర యాత్ర లో సాహితీ భాగస్వామ్యాన్ని అందించాడు. ఆ తదుపరి మంటల జెం డాలు, చురకలు, రక్తరేఖ, ఎండమావి, సంక్షోభ గీతం, సిటీలైఫ్ సంపుటా లు ముద్రితమయ్యాయి. అనారోగ్యం బారిన పడి 1993 జనవరి 12న అస్తమించాడు. అతడు అస్తమించినా అలిశెట్టి మినీ కవిత్వం ప్రతీ నోట వినబడుతోంది

● మారసం ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు

సాహితీవేత్త అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతిని సిరిసిల్ల మానేరు రచయితల సంఘం ఘనంగా నిర్వహిస్తోంది. గురువారం సిరిసిల్లలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అలిశెట్టి కవిత్వంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని శారద మాట్లాడుతూ అలిశెట్టి ప్రభాకర్ మినీ కవితల ద్వారా సమాజ హితాన్ని కోరుకున్నారన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశం కూడా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మానేరు రచయితల సంఘం అధ్యక్షుడు టీవీ నారాయణ, కార్యానిర్వాహక అధ్యక్షుడు ఎలగొండ రవి, ప్రధాన కార్యదర్శి ఆడెపు లక్ష్మణ్, రచయిత బూర దేవానందం, ఉపాధ్యాయులు జయంతి, సతీష్‌బాబు, రమేష్, కరికె నరేందర్ పాల్గొన్నారు.



బాల్య మిత్రులతో అలిశెట్టి

నృసింహుడి ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

ధర్మపురి, జనవరి 11: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం హుండీ లెక్కింపు గురువారం నిర్వహించగా రూ 54,21,314 ఆదాయం లభించింది. 95 రోజులకు సంబంధించిన హుండీలు తెరచి లెక్కింపు నిర్వహించగా ఈ ఆదాయం లభించింది. అలాగే 90 గ్రాముల మిశ్రమ బంగారం, 6 కిలోల 200 గ్రాముల మిశ్రమ వెండి, 31 విదేశీ నోట్లు లభించాయి. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ ఎ. చంద్రశేఖర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ వైస్‌చైర్మన్, ఆలయ రినోవేషన్ కమిటీ సభ్యులు ఇందారపు రామయ్య, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివా సాచార్యులు, సీనియర్ అసిసెంట్ అలువాల శ్రీనివాస్, ఆర్యవైశ్య సత్రం కోశాధికారి జక్కు దేవేందర్ పాల్గొన్నారు.

● ఆలయానికి స్టీల్ హుండీలు బహూకరణ

ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పక్షాన రూ 2 లక్షలు విలువ గల రెండు హుండీలను ఆ బ్యాంక్ డీజీఎం శంకర్ హేంబ్రం చేతుల మీదుగా గురువారం సమర్పించారు. ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం రెండు స్టీల్ హుండీలను ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్‌కు అందించారు. ఆలయం పక్షాన ఆయనను స్వామి శేష వస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో యుబీఐ జగిత్యాల జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పొన్న వెంకటర్‌రెడ్డి, చీఫ్ మేనేజర్ సరల్‌గుప్తా, ధర్మపురి బ్రాంచ్ మేనేజర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అండర్-19 ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్లు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 11: సిద్దిపేట జిల్లాలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో జరగనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్ల వివరాలను జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్ ప్రకటించారు. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభచాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామని తెలిపారు.

● ఎంపికైన జట్లు..

బాలికల విభాగంలో బి ప్రవళిక(ధర్మారం), జి అంజలి (ధర్మారం), బి వైష్ణవి(కొడిమ్యాల), కె వెన్నెల(కుమ్మరిపల్లి), ఆర్ పూజిత(కుమ్మరిపల్లి), గౌరి పూజిత(కరీంనగర్), ఆర్ అఖిల(కుమ్మరిపల్లి), టి శిరీష(ధర్మారం), సిరిచందన, లిఖిత(మానకొండూర్), బి జలజ(కొడిమ్యాల), బి లేఖన, ఎన్ వైష్ణవి(కుమ్మరిపల్లి), ఎన్ చరణి(ధర్మారం), జి కావ్య (కుమ్మరిపల్లి), బి శ్రావ్య(కొడిమ్యాల) ఎంపికయ్యారు.

బాలుర విభాగంలో ఆర్ అనిల్, ఆర్ హర్షవర్ధన్(మానకొండూర్), ఎ వర్షిత్(మల్యాల), ఓ సాయి, డి సిద్ధార్థ(ధర్మారం), ఎ మనోజ్‌కుమార్, టి అరుణ్ కుమార్, బి రాహుల్, సీహెచ్ రిషి(కుమ్మరిపల్లి), ఎ రోహిత్, కె అభినవ్(కరీంనగర్), టి బాలాజీ(దేవంపల్లి), డి శ్రీనివాస్(ధర్మారం), జె నాగరాజు(నందిమేడారం), ఎండీ రియామొద్దీన్(కేశవపట్నం) ఎంపికయ్యారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక జనవరి 11: మండలంలోని మాల్లారెడ్డిపల్లి గ్రామంలోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్నా ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణ చేస్తున్నా డ్రైవర్ రాయనవేని హరీష్, యాజమని రాయవేని సంపత్ పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మల్లికార్జున స్వామి హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

గొల్లపల్లి, జనవరి 11: ప్రముఖ పుణ్యక్షేత్రం మల్లన్నపేట మల్లికార్జున స్వామి దేవాలయం హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఈ సందర్భంగా హుండీ ఆదాయం రూ.22,37,246లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇందులో హుండీ ద్వారా రూ.18,10,786, టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.4,26,460, మిశ్రమ బంగారం 10 గ్రాముల 500 మి.గ్రా., మిశ్రమ వెండి 790 గ్రాములు సమకూరినట్లు చైర్మన్ కొండూరు శాంతయ్య, ఈవో విక్రమ్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రవి కిషన్, నాయకులు సిద్ధంకి మల్లయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గొల్లపల్లి, జనవరి 11: మండలంలోని శ్రీరాములపల్లె గ్రామానికి చెందిన బుర్ర గడ్డ శివ కుమార్ (21) గురువారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన బుర్రగడ్డ లత-శంకరయ్య దంపతులకు ఒక్కగానొక్క కొడుకు శివ కుమార్ మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. శివ కుమార్ ఇటీవల గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. తన పెద్దనాన్న గంగన్నతో కలిసి తాటి చెట్టు ఎక్కడానికి శ్రీరాములపల్లె గ్రామంలో రోడ్డు పక్కన ద్విచక్ర వాహనాన్ని నిలుపుతున్నాడు. ఈ క్రమంలో గొల్లపల్లి వైపు నుంచి హన్మాజీపేటకు చెందిన ప్రేమ్ కుమార్ అనే యువకుడు ద్విచక్ర వాహనంతో అతి వేగంగా ఢీకొట్టాడు. దీంతో బైక్‌పై ఉన్న శివ కుమార్‌తో పాటు గంగన్నలు రోడ్డు పక్కన ఎగిరిపడ్డాడు. ఈ ప్రమాదంలో శివ కుమార్ తలకు తీవ్ర గాయాలు కాగా, గంగన్నకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన కుటుంబసభ్యులు జగిత్యాల ప్రధాన ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యుల సూచనల మేరకు కరీంనగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో శివకుమార్ మృతి చెందాడు. దీంతో శ్రీరాములపల్లె గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేస్తే చర్యలు



విలేకరులతో మాట్లాడుతున్న ఏసీపీ జీవన్‌రెడ్డి

ఇల్లందకుంట, జనవరి 11: ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం ఇల్లందకుంట పోలీస్ స్టేషన్లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఆదివారం రాత్రి ప్రకృతి వనాన్ని ధ్వంసం చేసిన నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. మండలంలోని సిరిసేడు, బోగంపాడు గ్రామాలకు ఇల్లందకుంట శివారులోని ఎర్రగట్టు గుట్టల సమీపంలో ఆ రెండు గ్రామాలకు ఎకరం భూమిని కేటాయించారని చెప్పారు. కానీ కొందరూ వ్యక్తులు ఆ ప్రకృతి వనాన్ని ధ్వంసం చేసి ఆ భూమిని అక్రమించేందుకు కుట్ర పన్నినట్లు వెల్లడించారు. ఆ స్థలంలో 2,450 మొక్కలు నాటారని చెప్పారు. సుమారు వాటి ఖర్చు రూ. 6,44,436 అయినట్లు వివరించారు. కాగా సిరిసేడు గ్రామానికి చెందిన ఎంపీటీసీ చిన్నరాయుడు, రేణికుంట్ల రామస్వామి ఆ భూమిని అక్రమించుకోవాలని కుట్ర పన్నారని చెప్పారు. ఈ క్రమంలో సిరిసేడు గ్రామానికి చెందిన సల్పల రమేశ్‌కు చెందిన ఎక్స్‌కావేటర్ సహాయంతో చెట్లను తొలగించారని చెప్పారు. సోమవారం ఉదయం ప్రకృతి వనాన్ని ధ్వంసం చేసిన సంఘటనపై పంచాయతీ కార్యదర్శి అంకూస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని తెలిపారు. ఈ మేరకు చిన్నరాయుడు, రామస్వామి, సల్పల రమేశ్, ఎక్స్‌కావేటర్ డ్రైవర్ శశికుమార్‌లను గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. నిందితుల నంచి మోటర్ సైకిల్, ఎక్స్‌కావేటర్ స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆస్తులను ధ్వంసం చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సీఐ కిశోర్, ఎస్ఐ రాజకుమార్, సిబ్బందిని ఏసీపీ అభినందించారు. ఇంత జరిగిన నిందితులను అరెస్టు ను విలేకరులకు చూపకపోవడం గమనార్హం. సమావేశంలో రూరల్ సీఐ కొరె కిశోర్, ఎస్ఐ రాజకుమార్ పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

తంగళ్లపల్లి, జనవరి 11: తంగళ్లపల్లి మండల కేంద్రంలో చెన్నూరి పోశయ్య (30) అనే వలస కూలీ కుటుంబ కలహాలతో బుధవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన చెన్నూరి పోశయ్య, చిట్టి దంపతులు మూడు సంవత్సరాల క్రితం తంగళ్లపల్లికి వలస వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో భార్యభర్తలకు గొడవ జరగడంతో భార్య చిట్టి తల్లిగారింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెంది ఇంట్లోనే చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కమాన్‌పూర్, జనవరి 11 : మండలంలోని గుండారం గ్రామపరిధిలోని రాజేంద్రనగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫైంటిక్లయిన్ కాలనీకి చెందిన అభిషేక్ తన ద్విచక్ర వాహనంపై పెద్దపల్లి నుంచి స్వగ్రామం వైపు వస్తుండగా, గుండారం గ్రామానికి చెందిన పోలుదాసరి శేఖర్ తన ద్విచక్ర వాహనంపై రాజేంద్రనగర్ వైపు వస్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. శేఖర్ కాలికి తీవ్ర గాయాలయ్యాయి. పెద్దపల్లి ప్రభుత్వా సుపత్రికి తరలించారు. పోలీసులు వివరాలను సేకరించారు.

వివాహిత బలవన్మరణం

కోనరావుపేట, జనవరి 11: కోనరావుపేట మండలం బావుసాయిపేటలో వరకట్నం వేధింపులతో ఓ వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య పాల్పడగా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మృతురాలి భర్త, అత్తమామపై గొడవకు దిగారు. సంఘటన స్థలానికి చేరుకున్న వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి గొడవ జరగకుండా బందోబస్తు నిర్వహించారు. పోలీసుల కథనం ప్రకారం... కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన సయ్యద్ అస్లీమ్‌తో వేములవాడ మండలం ఫాజుల్‌నగర్ గ్రామానికి చెందిన నజీనా (21)కు రెండు సంవత్సరాల క్రితం పెళ్లి చేశారు. వివాహ సమయంలో ఐదు తులాల బంగారం, లక్ష రూపాయల నగదు, రెండు లక్షల బండి ఇచ్చి వివాహం చేశారు. వివాహం చేసిన అనంతరం ఆరు నెలలు బాగానే ఉన్నారు. అప్పటి నుంచి మరో రెండు లక్షల రూపాయలు కట్నం తేవాలని భర్త అస్లం, మామ హైదర్, అత్త గోరబి వేధించారు. మరోవైపు మూడు నెలల పాప కళ్లు కనిపించకుండా పుట్టడం నజీనాను కుంగ తీసింది. పాపకు హైదరాబాద్‌లో చికిత్స చేయించడానికి మూడు లక్షల రూపాయలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. భర్త పట్టించుకోకపోవడంతో వీరి మధ్య దూరం పెరిగింది. ఈ క్రమంలోనే మనోవేదనకు గురైన నజీనా గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆత్మహత్య గల కారణాలను పరిశీలించారు. గొడవలు జరగకుండా వేములవాడ డీఎస్పీ నాగేంద్ర చారి, చందుర్తి సీఐ కిరణ్ కుమార్, కోనరావుపేట ఎస్సై ఆంజనేయు బందోబస్తు నిర్వహించారు. మృతురాలి తండ్రి మహమ్మద్ ఇచ్చిన ఫిర్యాదుతో భర్త అస్లం, మామ హైదర్, అత్త గురబిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎస్‌బీఐ ఏటీఎం చోరీకి యత్నం

సిరిసిల్ల క్రైం, జనవరి 11: సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లో ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి దొంగలు ప్రయత్నించారు. గురువారం తెల్లవారు జామున బీవైనగర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంలో దొంగలు చొరబడి బద్దలుకొట్టి దొంగిలించేందుకు యత్నించారు. ఈ చోరీ యత్నంపై ఏటీఎం సూపర్‌వైజర్ ఎస్.మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇళ్లల్లో చోరీ

కోల్‌సిటీ, జనవరి 11: గోదావరిఖని మార్కండేయ కాలనీ, వెంకటేశ్వరకాలనీలో బుధవారం రాత్రి తాళం వేసి ఉన్న నాలుగు ఇళ్లల్లో చోరీలు జరిగాయి. మార్కండేయ కాలనీలోని ఎండీ అహ్మద్‌పాషా ఇంటికి తాళం వేసి వెనుక గదిలో నిద్రిస్తుండగా ఇంటి తాళం పగులగొట్టి లోనికి చొరబడ్డ దొంగలు ఇంట్లోని తులంన్నర బంగారం, రూ.40వేల నగదు ఎత్తుకెళ్లినట్టు పోలీసులు పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముల్కనూర్ డెయిరీ సందర్శన

భీమదేవరపల్లి, జనవరి 11: ముల్కనూర్ మహిళా డెయిరీలో అమలు చేస్తున్న డీఐడీఎఫ్ ప్రాజెక్టును నాబార్డ్ అధికారులు గురువారం సందర్శించారు. నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీనాథ్, అసిస్టెంట్ మేనేజర్ మహాదేవ్ రెడ్డి పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో డ్రైవింగ్‌లో శిక్షణ

- టైడ్స్ ప్రిన్సిపాల్ రాఘవన్

సిరిసిల్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన డ్రైవింగ్ శిక్షణ అందిస్తున్న టైడ్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని అంతర్జాతీయ డ్రైవింగ్ శిక్షణ పరిశోధన సంస్థ ప్రిన్సిపాల్ బూవ రాఘవన్, జిల్లా రవాణాశాఖ అధికారి కొండల్‌రావు తెలిపారు. గురువారం అంతర్జాతీయ రహదారి భద్రతా మాసోత్సవం సందర్భంగా తెలంగాణలో అతి పెద్ద తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ (టైడ్స్)లో అంతర్జాతీయ ప్రమాణాల ద్వారా చేపడుతున్న కార్యకలాపాలు, రహదారి భద్రతపై సదస్సు నిర్వహించారు. జిల్లాలోని పాత్రికేయ బృందం ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రాఘవన్, కొండల్‌రావు మాట్లాడుతూ డ్రైవింగ్ శిక్షణ సంస్థలో మెకానికల్ నాలెడ్జ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. దేశంలో ఏటా 4.50 లక్షల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ ప్రమాదాల్లో 1.50 లక్షల మంది మరణిస్తున్నారని అన్నారు. ఇందులో యువతనే ఎక్కువగా ఉంటున్నారన్నారు. రోడ్డు భద్రతపై అవగాహన లేకపోవడం సరైన శిక్షణ లేకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డ్రైవర్లకు శిక్షణ ఇచ్చేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మండెపల్లిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అశోక్ లేలాండ్ సంయుక్త ఆధ్వర్యంలో రూ.22 కోట్లతో శిక్షణ సంస్థను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఐదెకరాల్లో పరిపాలన, వసతి గృహ భవనాలు, 15 ఎకరాల్లో డ్రైవింగ్ ట్రాక్‌లు నిర్మించినట్లు వివరించారు. శిక్షణ కాలపరిమితిలో 21 రోజుల కోర్సుకు రూ.7,080, 30 రోజుల కోర్సుకు రూ.16,520, మూడు రోజుల కోర్సుకు రూ.2250, ఒక రోజు కోర్సుకు రూ .750 చొప్పున ఉన్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు వివిధ కోర్సుల్లో 4 వేల మంది అభ్యర్థులు శిక్షణ పొందారని, 350 మందికి ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు లభించాయని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అందిస్తున్న శిక్షణను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్వో దశరథం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టైడ్స్ ప్రిన్సిపాల్ రాఘవన్

డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, జనవరి 11 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన 2024 - డైరీని గురువారం వేములవాడలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాదాసు బలరాం, ప్రధాన కార్యదర్శి చౌకి సుధాకర్, సిరిసిల్ల మండల అధ్యక్షుడు టీవీ లక్ష్మణ్‌రావు, ప్రధాన కార్యదర్శి జోగినిపల్లి మోహన్‌రావు, మండల అసోసియేట్ అధ్యక్షుడు బాలమల్లయ్య పాల్గొన్నారు.

సామాజిక కార్యక్రమాలతో గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

ఇల్లంతకుంట, జనవరి 11: విద్యార్థులు సామాజిక కార్యక్రమాలు చేపట్టడం ద్వారా గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని జంగమరెడ్డిపల్లెలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులపాటు గ్రామంలో ఉండడంతో ప్రజల జీవనస్థితిగతులపై విద్యార్థులకు అవగాహన కలుగుతుందన్నారు. తరగతి గదులలో నేర్చుకున్న అంశాలకు అలంబనగా సామాజిక కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. సర్పంచ్ తూముకుంట శ్రీలతనరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కుమారస్వామి, ఉపసర్పంచ్ కుమ్మరవేని ఎల్లయ్య, అధ్యాపకులు మల్లారెడ్డి, జీవన్‌బాబు, లింగమూర్తి పాల్గొన్నారు.

వేధింపులకు గురైతే ఫిర్యాదు చేయాలి

ఇల్లంతకుంట, జనవరి 11: మహిళలు వేధింపులకు గురైతే పోలీసులకు ఫిర్యాదు చేయాలని మహిళా సాధికారత జిల్లా కోఆర్డినేటర్ రోజ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. సఖి కేంద్రం ద్వారా మహిళలకు వైద్య న్యాయ సలహాలు అందిస్తున్నట్లు తెలిపారు. బాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని ప్రేమలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ, చైల్డ్‌హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ పరమేశ్వర్, మహిళా సాధికారత కౌన్సిలర్ దేవిక తదితరులు పాల్గొన్నారు.

సీపీఐలో చేరిన సీపీఎం నాయకుడు గణేష్

సిరిసిల్ల టౌన్, జనవరి 11: సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో ముగ్దుం భవన్‌లో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి సమక్షంలో సీపీఎం జిల్లా నాయకుడు అన్నల్‌దాస్ గణేష్ సీపీఐలో చేరారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో సీపీఐని మరింత బలోపేతం చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టుల ఐక్యత అనివార్యమన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు పంతం రవి, మంద సుదర్శన్ పాల్గొన్నారు.

నిరు పేదలకు దుప్పట్ల పంపిణీ

సిరిసిల్ల టౌన్, జనవరి 11 : సిరిసిల్ల పట్టణం సర్దార్‌నగర్‌లో దారుల్ ఖైర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి నిరు పేదలకు ఉచితంగా దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఆకుల కృష్ణ, దారుల్ ఖైర్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు ఎండీ ఖుదూస్, ఎండీ ఇన్‌కేసార్‌బాబా, నాయకులు ఎండీ రఫీ, సర్వర్, సలీం పాషా సుఫీయన్, ఎండీ అజ్మత్ అన్సారీ పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

సిరిసిల్ల టౌన్, జనవరి 11 : సిరిసిల్ల పట్టణం శివనగర్ జడ్పీహెచ్ఎస్‌లో ఏఐటీయూసీ, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ నాయకులు యూనియన్ జనరల్ బాడీ సదస్సు కరపత్రాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పంతం రవి మాట్లాడుతూ తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికుల హక్కుల కోసం యూనియన్ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ఫిబ్రవరి 4న సిరిసిల్ల పద్మశాలి కల్యాణ మండపంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా జనరల్ బాడీ సదస్సును నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్, నాయకుడు చిటెకెన సత్తయ్య, కార్మికులు పాల్గొన్నారు.

జాతీయ సాహస శిబిరానికి ఎంపిక

తంగళ్లపల్లి, జనవరి 11: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని గిరిజన మహిళ డిగ్రీ కళాశాలలో చదువుతున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్ కాసారపు భవాని జాతీయ సాహస శిబిరానికి ఎంపికై శిక్షణ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా వాలంటీర్‌ను యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్, కళాశాల ప్రిన్సిపాల్,అధ్యాపక బృందం అభినందించారు.

ధూపదీప నైవేద్య అర్చక సంఘం కార్యవర్గం

తంగళ్లపల్లి, జనవరి 11 : తంగళ్లపల్లి మండల ధూపదీప నైవేద్య అర్చక సంఘం అధ్యక్షుడిగా పారునంది అంజనేయ శర్మను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా తెంబరవేని రాములు, కార్యదర్శిగా కోమురవు శివప్రసాద్, కోశాధికారిగా జిల్లా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. రాష్ట్ర, జిల్లా నాయకులు వెగ్గలం సంతోష శాస్త్రి, కందాళై వెంకటరమణాచార్యులు, చెర్లపల్లి కాశీనాథ శర్మ, రాజమౌళి, అశోక్, సత్యం, మహేందర శర్మ, నవీన్‌కుమార్, మనోహర్ పాల్గొన్నారు.

టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 11: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తెలంగాణ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం కాళేశ్వరం 8వ ప్రాజెక్ట్ ఈఈ శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ రియాజ్ అలీ, అధికారులు వేణు, బాలునాయక్, కిశోర్, శ్రీనివాస్, సత్యనారాయణ, వినోద్, వీణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 11 : ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, శ్రీచైతన్య పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రాలు ధరించి గాలిపటాలు ఎగురవేశారు. గోదాదేవి, హరిదాసు వేషధారణలో అలరించారు. ఈ సందర్భంగా భోగి మంటలు వేశారు. ముత్యాల ముగ్గులు వేసి, పిల్లలకు భోగి పళ్లు పోశారు. ముగ్గుల పోటీలు, పతంగుల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం జితేందర్, ప్రిన్సిపల్ కిరణ్ కుమార్, డీన్ విజయ్ కుమార్, ఏవో శేఖర్, దివ్య, పూర్ణిమ, మహేష్, బాపురెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట, జనవరి 11: మండలంలోని పలు ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని వాణీనికేతన్, పొత్తూర్‌లోని వివేకానంద, శ్రీవాణి, కేరళ తదితర పాఠశాలల ఆవరణలో భోగిమంటలు వేశారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గాలి పటాలు ఎగురవేశారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంతోపాటు పలు పాఠశాలల్లో గురువారం సంక్రాంతి సంబరాలను సాంప్రదాయంగా జరిపారు. సంక్రాంతి గంగిరెద్దులు, గొబ్బెమ్మలు, హరిదాసులు వంటివి తెలుగుజాతికి చిహ్నాలని, కేజీబీవీ ప్రత్యేక అధికారి నీలిమా అన్నారు. సంప్రదాయ వేషధారణలు, గాలిపటాల ఎగురవేత, గొబ్బెమ్మల ముగ్గులు తదితర కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: వేములవాడ పట్టణంలోని పలు పాఠశాలలో విద్యార్థులు ముందస్తూ సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. పట్టణంలోని కృష్ణవేణి పాఠశాల కరస్పాండెంట్ శ్రీసన్నిది వెంకటకృష్ణ, గౌతమ్ మోడల్ కరస్పాండెంట్ బూర ఉ మా ఆధ్వర్యంలో విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి పాఠశాల ఆ వరణలో సంక్రాంతి ముగ్గులను వేశారు. గొబ్బెమ్మలను పెట్టి నృత్యాలు చేస్తూ సంబరాలు జరుపుకున్నారు.

చందుర్తి: చందుర్తి మండలం సనుగుల, మల్యాల గ్రామాల్లోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో గురువారం ముందస్తు సంక్రాంతి పండగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సనుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి పండగ పురస్కరించుకొని ముందస్తుగా పాఠశాలను అరటి చెట్లతో, మామిడి తోరణాలు, పూలదండలతో అలంకరణ చేశారు. విద్యార్థులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు కలిసి వేశారు. మల్యాల గ్రామంలోని సాధన పాఠశాలలో విద్యార్థులు రంగురంగుల ముగ్గులు వేశారు. చిన్నారులకు పండ్లు, పూల, పాలు పొంగియడం కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పండగ విశిష్టత విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, కరస్పాండెంట్ చెన్నమనేని రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు హనుమాండ్లు, మల్లారెడ్డి, సదానందం, శంకర్, శ్రీలత, కవిత, సుజాత, మమత, తిరుపతి, శోభరాణి, నిత్య, శిరీష, మానస, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

బోయినపల్లి: సంక్రాంతి పండుగ సమీపిస్తుండడంతో బోయినపల్లి మండలం విలాసాగర్ హైస్కూల్‌లో గురువారం ముందస్తుగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొలగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించిన సంక్రాంతి పండుగ సంబరాలు అంబరాన్ని ఆకట్టుకున్నాయి. వివిధ వేషధారణ ద్వారా విద్యార్థులు వారి నైపుణ్యాన్ని ప్రదర్శించారు. అదే విధంగా జాతీయ యువజన దినోత్సవం స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు స్వామి వివేకానంద స్ఫూర్తితో మన దేశం కీర్తి ప్రతిష్టలు నలుమూలల చాటాలని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ అన్నారు. ఎం.రాజిరెడ్డి, కె. శోభారాణి, వెంకట హనుమాన్, సురేందర్ రెడ్డి, మధుసూదన్, జోష్న రాణి, ప్రకాష్, రాధిక, మోహనకృష్ణ, వసుంధర, పిఈటి మధుకర్ రెడ్డి, సి.హెచ్ స్వర్ణలత, శమంతకమణి, షఫీయొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ వనిత మాట్లాడుతూ విద్యార్థి దశలోనే పిల్లలకు పండుగల ప్రాముఖ్యత తెలుస్తుందన్నారు. సంక్రాంతి పండుగ వచ్చిందంటే గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటా అహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. విద్యార్థులు హరిదాసులు వేషాలు అలాగే ముగ్గులను ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రుద్రంగి కేజీబీవీలో సంక్రాంతి వేడుకలు



విద్యార్థుల డోలు నృత్యం



ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



కేజీబీవీ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



మల్యాలలో చిన్నారుల సందడి

అటవీ భూములు అన్యాక్రాంతం



శివంగాలపల్లి అటవీ ప్రాంతంలో నరికివేసిన చెట్లు

కోనరావుపేట, జనవరి 11 : అటవీ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు ఇస్తుందన్న ఆశతో కొంతమంది అక్రమ దారులు అటవీ ప్రాంతంలో చెట్లను నరికేస్తూ సాగుకు యత్నిస్తున్నారు. ఇలాగైతే అటవీ సంపదను కొల్లగొట్టిన వారమవుతామని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అటవీ ప్రాంతంలో పోడు భూముల్లో చెట్లను నరికి వేస్తూ సాగు చేసుకునేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. కోనరావుపేట మండల కేంద్రం నుంచి శివంగాలపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న అటవీ ప్రాంతంలో చెట్లను నరికి వేస్తూ సాగుకు యత్నం చేస్తున్నారు. నరికిన చెట్లను కాల్చివేసి ఆ ప్రాంతమంతా శుభ్రం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు ఇస్తుందన్న నెపంతో కొత్తగా చెట్లను నరికివేస్తూ అటవీ సంపదను కొల్లగొడుతున్నారు. ఇలానే కొనసాగితే అటవీ సంపద లేకుండా పోతుందని మండల వాసులు పేర్కొంటున్నారు. గతంలో ఉన్న భూములకే పట్టాలు ఇవ్వాలని, కొత్తగా చెట్లను నరకకుండా సంబంధిత అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు. గత ప్రభుత్వం లక్షలు వెచ్చించి అటవీ ప్రాంతాల్లో ప్లాంటేషన్ చేపడితే ధ్వంసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా చెట్లను నరకకుండా ఉన్న పోడు భూములకు పట్టాలు ఇచ్చి గిరిజనులను ఆదుకోవాలని కోరుతున్నారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన న్యాయవాదులు

సిరిసిల్ల క్రైం, జనవరి 11: హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్‌పోలియో జడ్జి జస్టిస్ పి.మాధవి దేవిని సిరిసిల్ల న్యాయవాదులు కలిశారు. గురువారం సాయంత్రం హైదరాబాద్‌లోని హైకోర్టులో జస్టిస్ పి.మాధవి దేవిని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కలిసి పలు సమస్యలను వివరించారు. ఈ నెల 27న సిరిసిల్ల జిల్లా కోర్టు ఆవరణలో రెండో అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టు ప్రారంభానికి రావాలని ఆహ్వానించారు. సిరిసిల్లలో న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడి లక్ష్మణ్, కార్యదర్శి అనిల్, మారుతి, నాగరాజుగౌడ్, గోవర్ధన్, కిషన్, సీనియర్ న్యాయవాదుల భాస్కర్‌రెడ్డి, ధర్మేందర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న సిరిసిల్ల న్యాయవాదులు

ఘనంగా వడ్డె ఓబన్న జయంతి



నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

సిరిసిల్ల టౌన్, జనవరి 11: జిల్లా వడ్డెర సంఘం ఆధ్వర్యంలో గురువారం సిరిసిల్ల పట్టణం అంబేడ్కర్ చౌరస్తా వద్ద స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న 217వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి వడ్డెర సంఘం జిల్లా నాయకులు పూలమాలలు వేశారు. అనంతరం వడ్డే ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు పల్లపు లక్ష్మణ్ మాట్లాడుతూ తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆదేశం మేరకు వడ్డే ఓబన్న జయంతి నిర్వహించామన్నారు. పల్నాడు సైరా నర్సింహరెడ్డి వద్ద సర్వసైనాధిపతిగా ఉంటూ బ్రిటీష్ పాలకులపై పోరాడిన యోధుడు వడ్డే ఓబన్నను మరిచిపోలేమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డే ఓబన్న గొప్పతనాన్ని గుర్తించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రతీ సంవత్సరం వడ్డే ఓబన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. వడ్డెర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గొల్లం నర్సింగ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పీట్ల బాబు, పట్టణ అధ్యక్షుడు కోరుదల అంజయ్య నాయకులు వంశీకృష్ణ, శివరాత్రి అయిలయ్య, బోదాసు రమేష్, సూర ప్రశాంత్, దండ్ల సురేష్, దండుగుల నాంపెల్లి, చిన్నశంకర్, జిల్లా పరిధిలోని 13 మండలాల అధ్యక్షుడు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట : తొలితరం స్వాతంత్ర సమరయోధుడు వడ్డెర ఓబన్న చరిత్ర చిరస్మరణీయమని వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సూర దేవరాజు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో వడ్డెర ఓబన్న విగ్రహం ఏర్పాటుకు గురువారం భూమి పూజ చేశారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఓబన్న విగ్రహాలను ఏర్పాటు చేసి రాష్ట్రంలో వడ్డెర జాతి ఆశయాలను కొనసాగిస్తామన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కానపురం లక్ష్మణ్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ జనరల్ సెక్రెటరీ పిట్ల వెంకటేష్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు రోడ్డ రామచంద్రం, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల రజతోత్సవం

ఎల్లారెడ్డిపేట, జనవరి 11 : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన రజతోత్సవాలను గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథులుగా నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య హాజరయ్యారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డీఈవో రమేష్ కుమార్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్‌రావు, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, పాఠశాల కరస్పాండెంట్ లతీఫ్, ప్రిన్సిపల్ నయీమా, జడ్పీటీసీ చీటీ లక్ష్మణ్ రావు, సెస్ డైరెక్టర్ వర్స కృష్ణహరి, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా, ఎంపీటీసీలు పందిర్ల నాగరాణి, అనసూయ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ కార్యవర్గం

చందుర్తి, జనవరి 11 : చందుర్తి మండల ఫొటో, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాపల్లి గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా తాటికొండ నరేష్, ఉపాధ్యక్షుడిగా విజయ్, కోశాధికారి వంకాయల శ్రీకాంత్, ఉప కోశాధికారిగా, బత్తుల ఉదయ్ కుమార్, సలహాదారులుగా కొడగంటి శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా తౌట్ సురేష్, అసినిపర్తి యేసు కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాపల్లి గంగాధర్ మాట్లాడుతూ ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ఉపాధ్యాయుల పదోన్నతులు చేపట్టాలి

సిరిసిల్ల రూరల్, జనవరి 11 : విడుదలై ఆగిపోయిన ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు, నియామకాల ప్రక్రియను తిరిగి చేపట్టి వెంటనే పూర్తి చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫేడరేషన్ (డీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు దొంతుల శ్రీహరి కోరారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో గురువారం డీటీఎఫ్ యూనియన్ అధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంపై పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. తొమ్మిదిన్నర సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు పదోన్నతులు లేక విద్యారంగం నిరాదరణకు గురైందన్నారు. ఉన్నత పాఠశాలల్లో పదవీవిరమణ పొందిన వారి స్థానంలో పదోన్నతులతో భర్తీలు చేయకపోవడంతో సబ్జెక్టుల ఉపాధ్యాయుల కొరత ఏర్పడిందన్నారు. ఐదేళ్లుగా ఉపాధ్యాయుల బదిలీలను చేపట్టకపోవడంతో ఉపాధ్యాయుల నియామకాలు లేక అన్నిరకాల పాఠశాలల్లో వివిధ ఖాళీలు భర్తీ చేయకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోవాల్సివచ్చిందన్నారు. నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అవ్వరం సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ అయిల్నేని రాజేశ్వర్‌రావు, సత్యనారాయణ, విష్ణుప్రసాద్, సురేష్, రాజేశం, రవీందర్, సంపత్, రమేష్, అశోక్, అనిల్, విష్ణుప్రసాద్‌రావు, శ్రీనివాస్, రాజేందర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంఘాల అభ్యున్నతికి కృషి చేయాలి

ఎల్లారెడ్డిపేట, జనవరి 11: గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల అభ్యున్నతికి మండల సమాఖ్య కృషి చేయాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పద్మయ్య కోరారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో కావేరి మండల సమాఖ్య సమావేశానికి గురువారం హాజరై ఆయన మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. బ్యాంకు లింకేజీ, శ్రీనిధి రుణాలు తీసుకున్న సంఘాలు వాయిదాల ప్రకారం చెల్లించేలా చూడాలని కోరారు.ఏపీఎం మల్లేశం, మండల సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, జిల్లా ఏపీఎం రాజేశం, శ్రీనిధి ఆర్ఎం రాంనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ బాబు, గ్రామాల సంఘాల అధ్యక్షులు, సీసీలు, ఎంఎస్సీలు పాల్గొన్నారు.

టీకొట్టు నిర్వాహకుడి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, జనవరి 11: సిరిసిల్ల పట్టణంలోని సర్ధార్‌నగర్‌లో సామాల వీరేందర్(21) అనే టీకొట్టు నిర్వాహకుడు గురువారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. టౌన్ సీఐ ఉపేందర్ వివరాల ప్రకారం... పట్టణంలోని సర్ధార్‌నగర్‌కు చెందిన వీరేందర్ మహారాష్ట్ర నుంచి జీవనోపాధి కోసం సిరిసిల్లకు వలస వచ్చాడు. వీరేందర్ కుటుంబం వెంకంటపేటలో కూరగాయాలు విక్రయిస్తుండేది. ఇటీవల తల్లి రమతో కలిసి చాయ్ దునియా అనే కొట్టు పెట్టారు. కుటుం బసభ్యులతో అద్దెకు ఉంటున్న ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గతేడాది అతడి అమ్మమ్మ, తాతలు మరణించినప్పటి నుంచి వీరేందర్ మనస్థాపానికి గురైనట్లు తల్లి రమ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు మృతదేహానికి ఏఎస్ఐ అంజయ్య పంచనామా చేసి పోస్టు మార్టం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు.

కేటీఆర్ బంధువులే బాగుపడ్డారు



సమావేశంలో మాట్లాడుతున్న కే చక్రధర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, జనవరి 11: బీఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో కేటీఆర్ బంధువులే బాగుపడ్డారని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కే చక్రధర్‌రెడ్డి అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమవేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ మూడు నెలలు కూడా సజావుగా పరిపాలనను అందించదని బీఆర్ఎస్ నాయకులు ఆక్షేపించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ప్రజలు నిర్దిష్టమైన మెజార్టీని ఇచ్చి పరిపాలన చేయాలని తీర్పునిచ్చినప్పుడు స్వాగతించాలన్నారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి కాంగ్రెస్ పార్టీపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, ప్రజలు నమ్మె పరిస్థితులో లేరని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మోసాలు, దందాలు ప్రజలకు తెలిసిపోయాయన్నారు. ప్రతీరోజు కేటీఆర్ వెంట తిరిగిన నాయకుడి రూ.5కోట్ల కుంభకోణం బయటపడిందని ఆరోపించారు. దీని వెనకాల కేటీఆర్ పీఏలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. కేటీఆర్ టీం కూడా ఉందని దీనిపై పూర్తి విచారణ జరగల్సి ఉందని అన్నారు. నీళ్ల, నిధులు, నియామకాలతో కేటీఆర్ కుటుంబానికే లబ్ధి జరిగిందని, ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు వారి స్వార్థం కోసం పనిచేశారే తప్పా ఏనాడూ ప్రజల కోసం పనిచేయా లేదని అన్నారు. కాళ్లేశ్వరం మేడిగడ్డ కుంగిపోవడంతో నేడు కాంగ్రెస్ ప్రభుత్వం నీరు అందించలేక పోతోందన్నారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, మాజీ కౌన్సిలర్ యెల్లె లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

- గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలో వివిధ కారణాలతో మృతి చెందిన రాజశేఖర్, బాలయ్య, గౌస్ కుటుంబాలకు 25 కిలోల చొప్పున 75 కిలోల బియ్యాన్ని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ అందజేశారు. కాంగ్రెస్ నాయకులు ఎడబోయిన ప్రభాకర్, మల్యాల రాజవీర్, అరవింద్, చందు, నరేష్, అర్మాన్, అమీర్ తదితరులు ఉన్నారు.
- గంభీరావుపేట: గంభీరావుపేట మండలం గజసింగవరం ప్రభుత్వ పాఠశాలలోని 80 విద్యార్థులకు నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు గురువారం శాలువాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవీందర్‌రావుకు ఉపాధ్యాయ బృందం, గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హెచ్‌ఎం వర్షన్, పాఠశాల కమిటీ చైర్మన్ నరేష్ తదితరులు ఉన్నారు.
- సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 40 మంది విద్యార్థులకు గురువారం జేఎస్ గౌతమ్ పుట్టినరోజుతోపాటు అంకారపు శ్రీహరి జ్ఞాపకార్థం కుటుంబీకులు అర్క మిత్ర ఫౌండేషన్ నిర్వాహకులు జేఎస్ అరవింద్, అంకారపు శ్రీకాంత్ పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు గణేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డుపై మురికి నీరు.. పట్టించుకోరూ





ప్రభుత్వాస్పత్రి ఎదుట పారుతున్న మురికినీరు, ప్రధాన రోడ్డుపై మురుగు నీటి ప్రవాహం

గంభీరావుపేట, జనవరి 11:గంభీరావుపేట మండలం లింగన్నపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట మురి కి నీరు ప్రవహిస్తోంది. పంచాయతీ పాలక వర్గం, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చే బాధితులకు మురికి నీటితో ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి ప్రధాన రోడ్డు గుండా, ఆస్పత్రి ఎదుట మురికి పారుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ఆసుపత్రిలోకి వెళ్లాలంటే మురికి నీరును దాటాల్సిన పరిస్థితి ఉండటంతో పాలకులపై స్థానికులు మండి పడుతున్నారు. సిద్దిపేట-కామారెడ్డి ప్రధాన రోడ్డు మార్గంలో మురికి నీటి వాసన వెదజల్లుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులుగానీ, ప్రజా ప్రతినిధులుగానీ స్పందించాలని, మురికి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.